క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: చిన్న పిల్లలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శివనాగప్రసాద్ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని నన్నూరు గ్రామంలోని అంగన్‌వాడీ–1, 2వ కేంద్రాలలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్లతో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 0–6 ఏళ్ల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. వారికి బలమైన ఆహారం పెట్టాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు ఫాతిమాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో భవిష్యత్ తరాలకు ముప్పు



సి.బెళగల్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్లాస్టిక్‌లతో భవిష్యత్ తరాలకు ముప్పని, ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత అని ఎంపీడీఓ రాముడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన, మండల అధికారులతో కలిసి ఈఓఆర్డీ సందీప్ గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు, వాడకను ప్రజలు నిలువరించుకోవాలని ఎంపీపీ అన్నారు. మండల ప్రత్యేకాధికారిణి శ్యామల మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. మండలంలోని గ్రామాలలో ఈనెల 15వ తేదీ నుంచి ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఈఓఆర్డీ అన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ జేడీ రంగాలక్ష్మీదేవి

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లోని ఇండ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి బుధవారం మండల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టుకోని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు ప్రారంభించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న పాల్గొన్నారు.

పెద్దటేకూరులో 'పొలంబడి'



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కల్లూరు: మండలంలోని పెద్దటేకూరు గ్రామానికి మధు అనే రైతు పొలంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు హేమలత, మాధురి, ఏఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులను, వీఏఏ(గ్రామ వ్యవసాయ సహాయకులను) గ్రూపులుగా ఏర్పాటు చేసి వ్యవసాయ పరిసరాల విశ్లేషణ చేశారు. దీని ద్వారా రైతుల లో పంట పరిస్థితికి అనుగుణంగా సరైన నిర్ణ యం తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ పరిధిలోని నంద్యాల–నందికొట్కూరు రహదారిపై ఏర్పడిన చీలికలలో పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గడిగరేవుల గ్రామానికి చెందిన వెంకటరమణ సొంత పనుల నిమిత్తం నంద్యాలకు వెళ్లి బైకుపై వస్తుండగా గ్రామ సమీపంలో రోడ్డుపై చీలికలలో టైరు పడటంతో అదుపుతప్పింది. దీంతో తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనవసర మందులతో నష్టమే!

- అవసరమైన మేరకే పైర్లకు పురుగు మందులు వాడాలి
- పొలాల్లో పిచికారీ సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు అనుసరించాలి



పెసరవాయి గ్రామం వద్ద సోయాబీన్ పంటకు పిచికారీ చేస్తున్న దృశ్యం

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగు చేసి పంటలకు వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లను ఆశించే పురుగులను నాశనం చేయడానికి వివిధ రకాల పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి చివరి వరకు అవగాహన లేకుండా, ఇష్టానుసారంగా మందులు వాడుతుంటారు. ఇలా చేయడం వలన నష్టమే ఎక్కువని ఇన్‌చార్జ్ ఏడీఏ హేమసుందర్‌రెడ్డి చెబుతున్నారు. అలాగే మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు నిర్లక్ష్యంగా చేయరాదని హెచ్చరిస్తున్నారు. ఎప్పుడూ వాడే మందులే కదా అని నిర్లక్ష్యంగా పిచికారీ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దంటూ హెచ్చరిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అన్నదాతలు రక్షణ పొందడంతోపాటు లాభాలు గడించవచ్చని పేర్కొంటున్నారు.

అవసరమైతేనే వాడాలి

పైరుపై సీజనల్‌గా ఏదో ఒక పురుగులు సోకుతుంటాయి. ఒకటి రెండు పురుగులు కనిపించగానే రైతన్నలు పైరుపై వివిధ రకాల పురుగు మందులు వాడేస్తున్నారు. ఇలా చేయడం వలన పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి.

మందుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ పంటలు సాగు చేశారు. పంటలపై పురుగులను నివారించేందుకు వివిధ కంపెనీలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఏ మందు పడితే ఆ మందును పైరుపై పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. గ్రామాలలోని ఫర్టిలైజర్ దుకాణదారులు, కమిషన్ వ్యాపారులు ఏమందు ఇస్తే అదే వాడటం రైతులకు పరిపాటిగా మారింది.

మోతాదు మేరకే వాడాలి

వ్యవసాయాధికారుల సూచనలు మేరకే తెగుళ్ల, పురుగుల నివారణకు మందులను వాడాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందులు వాడితే పంటకు నష్టం కలిగించడంతో పాటు అధిక వ్యయంతో పాటు రైతులకు పెట్టుబడి పెరుగుతుంది. పురుగులకు వ్యాధి నిరోధకశక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి ఉధృతమవుతుంది. పైరుపై ఎక్కువ సార్లు మందులను పచికారీ చేయడం మంచిదికాదు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గుర్తింపు పొందిన కంపెనీల పురుగు మందులనే వాడాలి. మందు డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లో కానీ కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. మందులను నీటిలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులతో పాటు రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కళ్లలో పడకుండా రైతులు కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా పురుగుమందు తుంపర్లు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లటి నీళ్లతో బాగా కడిగి వైద్యుని సంప్రదించాలి. శరీరంపై గాయాలు ఉన్నవారు మందులను పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయడం ఎంతో ఉత్తమం. పిచికారీ అనంతరం రైతులను రెండు మూడు సార్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పశువుల మేత కోసం పెంచిన పైర్లలో మందుల వినియోగం నిషేధించాలి. కల్తీ మందులు వాడకూడదు.

సాగు వ్యయం పెంచుకోవద్దు



రైతులు అనవసరంగా ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వల్ల సాగు వ్యయం పెరిగిపోతుంది. అవసరమైన మేరకు మాత్రమే మందులు వాడాలి. ప్రభుత్వం అనుమతించిన ఎరువులు, పురుగు మందులను వాడాలి. ఆయా గ్రామాల్లోని రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి రైతుభరోసా కేంద్రాలలోని సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. పంటలపై పిచికారీ చేసే సమయంలో రైతులు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలి.

– హేమసుందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, నంద్యాల

కౌలుకార్డుల నమోదు వందశాతం పూర్తవ్వాలి

గడివేముల: కౌలు రైతులకు పంపిణీ చేసే సీసీఆర్సీ కార్డుల విషయంలో అలసత్వం వద్దని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ...ఈ నెల 5వ తేదీతో సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తు గడువు ముగుస్తున్నందున శతశాతం నమోదు లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాల కొరత లేదని అన్నదాతల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఇండెంట్‌లు పెట్టుకోవాలని వీఏఏలకు సూచించారు. కార్యక్రమంలో ఏవో హేమసుందరరెడ్డి, పలు గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్: వ్యవసాయ సిబ్బంది గ్రామాలలోని రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సి.బెళగల్, సంగాల గ్రామాలలో పర్యటించి ఆర్బీకేలను సందర్శించారు. కియోస్కో పనితీరు పరిశీలించిన ఆయన ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను నమోదు చేయించారు. ఖరీఫ్ పంటల ఈ క్రాప్ నమోదును ప్రారంభించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీఈఓ వెంకటేష్, వీఏఏ సంధ్య తదితరులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత



గూడూరులో బాలింతకు పోషణ కిట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్ : మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. గూడూరులో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు, రక్త హీనతను తగ్గించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద విటమిన్లు ఉండే ఆహారాన్ని అందిస్తుంన్నారు. అయితే గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతుండటంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆయా ఆహార పదార్థాలను ఇంటి వద్దకే అందించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అనంతరం మహిళలకు రేషన్ సరుకులతో కూడిన కిట్లను అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, మహేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీడీపీఓ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాణ్యంలో గర్భిణులకు కిట్లు అందిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ

కల్లూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాలింతలు, గర్భిణులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ప్రారంభించారని సల్కాపురం సర్పంచు మద్దిలేటి అన్నారు. బుధవారం గ్రామ సచివాలయంలో గర్భిణులు బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

తల్లీబిడ్డల రక్షణకు టీహెచ్ఆర్

పాణ్యం : తల్లీబిడ్డలకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 'టీహెచ్ఆర్' టేక్ హోమ్‌రేషన్ పేరుతో కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ, ఈఓ అనురాధ, ఏపీఓ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ బాలచెన్ని, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సూపర్ వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సమయానుసారం టీకాలు వేయాలి

కర్నూలు (న్యూటౌన్): చిన్నపిల్లలందరికీ సమయానుసారం టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఏఎన్ఎంలను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలందరికీ రోట, ఎంఆర్1, ఎంఆర్2 వ్యాక్సిన్‌లు వందశాతం పూర్తి చేయాలని అన్నారు. గర్భిణులకు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఎంసీపీ కార్డు, ఏఎన్ఎం యాప్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం జగనన్న సంపూర్ణ పోషణ కిట్‌సను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేసి, చిన్నపిల్లలకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయమాధురి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తుది దశకు 'గోరుకల్లు' మరమ్మతులు

పాణ్యం : గోరుకల్లు కట్ట మరమ్మతుల పనులు తుది దశకు చేరుకున్నాయి. మరో నాలుగు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని ఈఈ సుభకుమార్ బుధవారం తెలిపారు ఆయన మాట్లాడుతూ ఇటీవల కట్టకు అమర్చిన రాళ్లు(పిచ్చింగ్) జారీ జలాశయంతో పడ్డాయన్నారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫొటోలతో కూడిన వినతి పత్రం అందించినట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు హై లెవెల్ కమిటీ, సీడీఓ సీఈ, సీఈల ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేసి సూచనలు ఇచ్చారన్నారు. వారి సలహాలతో పనుల్లో వేగం పెంచామన్నారు.



గోరుకల్లు కట్ట వద్ద జరుగుతున్న మరమ్మతులు

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



బిలకలగూడూరు జగనన్న లేఅవుట్‌లో ఇంటికి స్లాబ్‌వేసిన దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గ్రామంలో 282 మందికి ఇంటి స్థలాలు లేకపోవడంతో గుర్తించిన ప్రభుత్వం, వారందికి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం చేసేందుకు అనుమతులు మంజూరు చేసిందన్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నర్మాణాలు చేపట్టారని చెప్పారు. గ్రామానికి చెందిన జగనన్న లేఅవుట్‌లో మినావత్ విజయశాంతి బాయి ఇంటి నిర్మాణానికి మొట్టమొదటి స్లాబ్ వేయడం జరిగిందన్నారు. గత కొన్ని ఏళ్ల నుంచి అద్దెకు ఉంటూ జీవనం సాగించిన తన సొంతింటి కల త్వరలోనే నెరవేరబోతుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని ఇంటినిర్మాణాలు పూర్తి చేసి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు.

నవరత్నాలే విజయానికి పునాదులు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- నాడు చంద్రబాబుకు సీట్లు ఇవ్వలేదని సీమపై నిర్లక్ష్యం
- నేడు వైఎస్ జగన్ హయంలో సీమ సస్యశ్యామలం



బుక్‌లెట్లు పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలే వైఎస్సార్‌సీపీ విజయానికి పునాదులని వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రాంనగర్ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ ఆయా కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

రాయలసీమపై నిర్లక్ష్యం

టీడీపీ అధినేత చంద్రబాబు తాను పుట్టిన రాయలసీమకు తన 14 ఏళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క పని చేయలేదని బీవై మేయర్ రామయ్య దుయ్యబట్టారు. నాడు చంద్రబాబు రాయలసీమపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. 2014 ఎన్నికల్లో రాయలసీమ జిల్లాలో సీట్లు రాలేదనే ఏకైక కారణంతో సీమపై నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని సీమకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయ్యే ఎన్నికల్లో టీడీపీ రాయలసీమలో డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమన్నారు.

నేడు సీమ సస్యశామలం

ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాయలసీమపై చంద్రబాబు చిన్నచూపు చూసినందుకే గత ఎన్నికల్లో టీడీపీ ముచ్చటగా మూడు సీట్లతో ప్రజలు సరిపెట్టారన్నారు. నాడు టీడీపీ హయంలో కరువుకు కేరాఫ్‌గా రాయలసీమను మార్చగా, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు కురుస్తూ సస్యశామలంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులపై పర్యవేక్షణ పెంచండి

సి.బెళగల్: మండలంలోని పాఠశాలలో మనబడి నాడు– నేడు రెండవ విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలపై గ్రామ సచివాలయాల ఇంజనీర్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు అన్నారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా లతో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. మండలంలో రెండో విడత నాడునేడులో భాగంగా జరుగుతున్న పనులను నెలాఖరులోగా పూర్తి చేయించాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

కర్నూలు (న్యూటౌన్): వీఆర్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, ఓటర్ల ఇంటింటి సర్వేపై వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారి సమస్యలను పరిష్కరిస్తే ఎంతో సంతోషిస్తారని చెప్పారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత వీఆర్‌ఓలదేనని అన్నారు. సమావేశంలో డీటీ సాహెరాబాదు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని ఎస్ టర్నింగ్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది బుధవారం తెలిపారు. అనంతపురానికి చెందిన జనార్దన్ కారులో నంద్యాలకు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొంది. అలాగే అటు ఇటు డివైడర్ ఢీకొనడంతో జనార్దన్‌కు గాయాలైనట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

పాణ్యం పోలీసు స్టేషన్‌ను నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులపై ఆరా తీశారు. ఇటీవల నమోదైన ఎస్టీ కేసుకు సంబంధించి విచారణ చేపట్టారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుందని సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే రక్షణ గోడ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అంజి, వెంకటేశ్వర్లు, శీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

సి.బెళగల్: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాలు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సి.బెళగల్ మండల సర్పంచ్‌లు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండల సర్పంచ్‌ల సంఘం సభ్యులు సమావేశమై పంచాయతీల సమస్యలు, అవసరాలపై చర్చించారు. సంఘం అధ్యక్షుడు, కొత్తకోట సర్పంచ్ శ్రీనివాసులు, ఇతర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు గ్రామాల అభివృద్ధికి వినియోగం అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలకు విడుదల అయిన నిధులలో విద్యుత్ బకాయిలు అంటూ పెద్ద మొత్తంలో పెండింగ్ బిల్లులకు జమ చేయడంతో గ్రామాలలో పారిశుద్ధ్యం, వీధి బల్బుల ఏర్పాటు, తాగునీటి వనరుల నిర్వహణ కష్టమవుతుందని ఆవేదనను వెళ్లిబుచ్చారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాండురంగన్న, హనుమంతు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సర్పంచ్‌లు

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



కరిమద్దెలలో వృద్ధుడు నడిపి స్వాములకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు స్వామిరెడ్డి



గడిగరేవులలో రుషప్పకు పింఛన్ కానుక అందిస్తున్న వలంటీరు రేష్మ

గడివేముల: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రెండో రోజు బుధవారం లబ్ధిదారులకు పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. లబ్దిదారులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి సొమ్ము అందించారు. దీంతో పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 5,583 పింఛన్లు ఉండగా 5,265 మందికి అందించినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు.

కల్లూరు: కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లో రెండవ రోజు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. వలంటీర్లు ఇంటింటికీ పింఛన్‌దారుల దగ్గరకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్లు అందించారు.

పీహెచ్‌సీ వైద్యులు పద్ధతి మార్చుకోవాలి

సి.బెళగల్: పీహెచ్‌లో వైద్యులు పనితీరు మార్చుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీఓ రాముడుతో కలిసి సి.బెళగల్ పీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి మండల ప్రజా ప్రతినిధుల నుంచి వైద్యులపై ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సాయంత్రం మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సేవలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ జ్యోతి, ఆదామ్‌బాషా, గురుకుల ప్రిన్సిపల్ బలరాముడు తదితరులు ఉన్నారు.



సి.బెళగల్ పీహెచ్‌సీలో వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీడీ శ్యామల

ప్రతి ఇంటికి మెరుగైన వైద్య సేవలు

పాణ్యం : ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి ఇంటికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఎఫ్‌డీపీ(ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రామ్)జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలోని ప్రీ స్కూల్, సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఇంటి వద్దకు వైద్య సేవలపై కూడా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రామ్ కింద వైద్య సేవల్లో వేగం పెంచామన్నారు.



పాణ్యంలోని ప్రీ స్కూల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఫ్‌డీపీ జగదీష్‌చంద్రారెడ్డి